
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి ములుగు

5

బుధవారం 14 ఆగస్టు 2024



కోల్ రైల్‌కు సై





- ఓరుగల్లుకు రానున్న మూడు కొత్త రైల్వే మార్గాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేంద్ర రైల్వేశాఖ మంజూరు
- రైల్వే లైన్‌లతో పెరగనున్న రవాణా, కనెక్టివిటీ
- కాజీపేట - భూపాలపల్లి లైన్ ప్రస్తావన కరువు

7

ఇటీవల కేంద్ర రైల్వేశాఖ ప్రకటించిన కొత్త రైల్వే ప్రాజెక్టులు ఓరుగల్లుకు భారీ ప్రయోజనాన్ని చేకూర్చను న్నాయి. కోల్‌బెల్ట్ ప్రాంతమైన రామగుండం నుంచి భూపాలపల్లి, ములుగు మీదుగా మణుగూరు వరకు నిర్మించే రైల్వేలైన్ బొగ్గు సరఫరాతో పాటు పర్యాటక అభివృద్ధిలో కీలకం కానుంది. అలాగే డోర్నకల్ జంక్షన్ నుంచి మిర్యాలగూడ, గద్వాల వరకు వేర్వేరు రైల్వేలైన్లు ఇతర తూర్పు, దక్షిణ రైల్వేలైన్లతో కనెక్టివిటీని పెంచటంతో పాటు బొగ్గు, బియ్యం, గ్రానైట్ తదితర వాటిని సరఫరా చేసే విధంగా కొత్త రైల్వే కారిడార్ అభివృద్ధికి అడుగులు పడనున్నాయి. అయితే కాజీపేట రైల్వే డివిజన్‌తో పాటు కాజీపేట - భూపాలపల్లి రైల్వేలైన్‌పై కేంద్రం ప్రకటన చేయకపోవటంపై ఓరుగల్లువాసుల్లో కొంత అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓవర్‌యాక్షన్‌పై రియాక్షన్!



భూపాలపల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది (ఫైల్)

- వాహనదారులపై పోలీసుల నిఘా
- నంబర్‌ప్లేట్ లేకుండా నడిపితే కఠిన చర్యలు
- విస్తృత తనిఖీలు.. భారీగా జరిమానాలు
- నెల రోజుల్లోనే 600 పైచిలుకు వాహనాలకు ఫైన్
- భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా సాగుతున్న స్పెషల్ డ్రైవ్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 13: వాహనదారుల ఓవర్ యాక్షన్‌పై పోలీసులు నజర్ వేశారు. నిబంధనలు పాటించకపోవడంపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. ముఖ్యంగా నంబర్‌ప్లేటు లేని వాహనదారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. మితిమీరి వేగంతో వెళ్లినా, హెల్మెట్ ధరించకపోయినా, ఫోర్‌వీలర్స్ నడిపేటప్పుడు సీట్‌బెల్ట్ పెట్టుకోకపోయినా ఉపేక్షించడం లేదు. లైసెన్స్, ఇతర పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

భూపాలపల్లి జిల్లాలో వాహనదారులు చాలా మంది ట్రాఫిక్ రూల్స్‌ను బేఖాతర్ చేస్తున్నారు. ఇష్టమొచ్చినట్టు డ్రైవ్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పలువురి ప్రాణాలు తీసుకుంటున్నారు. పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారుల్లో చాలా మంది తమ తీరును మార్చుకోవడం లేదు. అంతేకాదు.. పోలీసుల చలాన్లను తప్పించుకునేందుకు వాహనదారులు వింత ప్రయోగాలకు పాల్పడుతున్నారు. కొంత మంది వాహన నంబర్ ప్లేట్‌ను పూర్తిగా తీసి వేయడం, మరికొందరు కనిపించకుండా స్టిక్కర్ అతికించడం చేస్తున్నారు. ఇంకొందరు చివరి రెండు నంబర్లను తొలగిస్తున్నారు. మరికొందరు నంబర్ ప్లేట్ కొంత భాగాన్ని ముందుకు గానీ, వెనక్కి గానీ వంచి పోలీసు కంట పడకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని సమయంలో పోలీసులు తీసే ఫొటోలకు ఈ నంబర్లు చిక్కకుండా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. అయితే.. నిబంధనలు పాటించని వాహనదారుల ఆటలకు ఖాకీలు కళ్లెం వేస్తున్నారు. నంబర్‌ప్లేట్ లేకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించడం లేదు. ఆ వాహనాన్ని ఠాణాకు తరలిస్తున్నారు. జరిమానా విధించడంతో పాటు వాహనానికి నంబర్ ప్లేట్ బిగించిన తర్వాతే తిరిగి అప్పగిస్తున్నారు.

అతిక్రమించే వారిపై కొరడా

జిల్లా కేంద్రంలో ఏర్పాటైన తాత్కాలిక ట్రాఫిక్ ఠాణా పోలీసులు చేపడుతున్న తనిఖీలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గతంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో భూపాలపల్లి ఠాణా పోలీసులే సాయంత్రం వేళల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టేవారు. ప్రస్తుతం ఎస్పీ కిరణ్ ఖరే చొరవతో ఏర్పాటైన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, మలుపుల వద్ద మాటు వేసి నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై దృష్టి పెట్టారు. ట్రాఫిక్ పోలీసుల కఠిన చర్యలతో వాహనదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. నంబర్‌ప్లేట్ లేకుండా రోడ్డెక్కాలంటే కొందరు జంకుతున్నారు.

నెల రోజుల వ్యవధిలో భారీగా జరిమానాలు

నంబర్‌ప్లేట్ లేకుండా నడుపుతున్న వాహనాలను పట్టుకోవడానికి పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ ఆకతాయిల ఆటకట్టిస్తున్నారు. భూపాలపల్లి, కాటారం సబ్ డివిజన్ పరిధిలో ఆయా ఠాణాల పోలీస్ అధికారులు ప్రధానంగా సాయంత్రం వేళల్లో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. 20 రోజుల కిందట వరుసగా మూడు రోజులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి నంబర్‌ప్లేట్ లేని వాహనాలను స్వాధీనం చేసుకొని జరిమానాలు విధించారు. జిల్లా వ్యాప్తంగా నెల రోజుల వ్యవధిలోనే పోలీసులు 600 పైచిలుకు వాహనాలకు ఫైన్ వేశారు. వీటిల్లో సుమారు 18 వాహనాలను సీజ్ చేసినట్లు ఆయా ఠాణాల పోలీసు అధికారులు వెల్లడించారు.



త్వరలోనే పూర్తి స్థాయి గెజిట్ ?

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఠాణాకు పూర్తి స్థాయిలో గెజిట్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఎస్పీ కిరణ్ ఖరే ప్రత్యేకంగా ప్రభుత్వానికి, డీజీపీ కార్యాలయానికి ట్రాఫిక్ ఠాణా ఏర్పాటు విషయమై ప్రతిపాదను పంపించారు. అయితే.. ఈనెల 10న తాజాగా ట్రాఫిక్ సేవలపై పట్టణంలోని అంబేద్కర్ కూడలి, గణేష్‌చౌక్ ప్రాంతాల్లో పోలీసులు అందిస్తున్న సేవలపై ఆ శాఖ వీడియో చిత్రీకరణ చేపట్టింది. దీంతో త్వరలోనే గెజిట్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. పూర్థి స్థాయిలో ఠాణా ఏర్పడితే ట్రాఫిక్ నియంత్రణ మరింత విస్తృతం కానున్నాయి.

ట్రాఫిక్ నియంత్రణ మరింత విస్తృతం: కిరణ్‌ఖరే, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ



జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ సేవలను విస్తృత పరుస్తున్నాం. నేరాల నియంత్రణలో భాగంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. చాలా మంది నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడుపుతున్నారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ ఠాణాను సైతం ఏర్పాటు చేశాం. పూర్తి స్థాయిలో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే పూర్తి స్థాయిలో గెజిట్ వస్తుందని ఆశిస్తున్నాం.

నిరంతర తనిఖీలు : శ్రీనివాస్, భూపాలపల్లి ట్రాఫిక్ ఎస్సై



జిల్లా కేంద్రంలో నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. ప్రధానంగా నంబర్‌ప్లేట్ లేని వాహనాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నాం. ఉదయం, సాయంత్రం అనే తేడాలేమీ లేకుండా ఎస్పీ ఆదేశాలతో నిరంతరాయంగా ప్రధాన కూడళ్లలో తనిఖీలు చేస్తూ నిబంధనలు అతిక్రమించిన వారిపై జరిమానాలు విధిస్తున్నాం. వాహనదారులు నంబర్‌ప్లేట్ లేకుండా వింత ప్రయోగాలు చేస్తే ఇట్టే దొరికిపోతారు. తదుపరి జరిమానాలతో పాటు వాహనాన్ని సైతం సీజ్ చేస్తాం.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

అధికారులతో ములుగు కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని, ఇందుకోసం ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. ఆర్డీవో సత్యపాల్‌రెడ్డితో కలిసి కలెక్టర్ తన చాంబర్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్టేజీ, ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. జాతీయ పతాకావిష్కరణ సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని సూచించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం పనితీరును ముందస్తుగా పరిశీలించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి అవసరమైన తాగునీటి సౌకర్యం, ఇతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. వేడుకలకు ప్రజలు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ప్రభుత్వశాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బందితో కలిసి తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ కార్యాలయ ఇన్‌చార్జి ఏవో రాజ్‌కుమార్, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, విద్యుత్‌శాఖ అధికారి నాగేశ్వర్‌రావు, విద్యాశాఖ అధికారి పాణిని, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనిన, తదితరులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్‌డేకు ముఖ్యతిథిగా మంత్రి సీతక్క



ములుగు, ఆగస్టు 13: జిల్లాలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్రప్రభుత్వం ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరుకానున్నారు. ఈమేరకు సీఎస్ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 15న ములుగులోని తంగేడు స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

భూపాలపల్లికి పొదెం వీరయ్య



భూపాలపల్లి కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో అధికారికంగా నిర్వహించే వేడుకలకు రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య హాజరుకానున్నారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ దరఖాస్తులకు ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 13: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష రాసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ కోసం ప్రభుత్వ (హాస్టల్ వసతి లేని) పాఠశాలల్లో ఎనిమిది తరగతి చ దువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.50లక్షలకు మించరాదని, ఏడో తరగతిలో 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50శాతం కలిగి ఉండాలని తెలిపారు. సెప్టెంబరు 13 వరకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు.

గంజాయిని నిర్మూలిద్దాం

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగాని వెంకటేశ్



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

కాటారం, ఆగస్టు 13: యువతరం జీవితాలను నిర్వీర్యం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలిద్దామని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగాని వెంకటేశ్ అన్నారు. మత్తు పదార్థాల నిర్మూలను కాంక్షిస్తూ డీవైఎఫ్వై జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 7న ట్యాల మండలంలో ప్రారంభమైన 120 కి.మీ పాదయాత్ర మంగళవారం కాటారం మండలకేంద్రంలో ముగిసింది. ముఖ్య అతిథిగా వెంకటేశ్ హాజరయ్యారుఎ. 'గంజాయి, డ్రగ్స్ నిర్మూలిద్దాం.. సమాజాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో డీవైఎఫ్ఐ ప్రజలు, యువతలో అవగాహన కల్పించడానికి పాదయాత్ర చేపట్టిందన్నారు. దేశ భవిష్యత్, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉండగా కొందరు వ్యసనాలతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడి పిల్లల నుంచి యూనివర్సిటీ విద్యార్థుల దాకా మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని అన్నారు. సరైన ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక యువత పెడదారి పడుతున్నారని, ప్రభుత్వం దృష్టిసారించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి, పాదయాత్ర ఇన్‌చార్జి ఆత్కూరి శ్రీకాంత్, నాయకులు రజిత, సుజాత, కవిత, సరిత, స్వాతి, జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని కలిగి ఉండాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

ములుగులో బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ నాయకులు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 13: ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ములుగులో మంగళవాంంం హర్‌ఘర్ తిరంగా భారీ ర్యాలీ జరిగింది. ముఖ్య అతిథిగా ఈటల హాజరయ్యారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు ప్రతి ఇంటిపై జాతీయజెండా, ప్రతి ఒక్కరి గుండెల్లో దేశభక్తి ఉండాలన్నారు. ఎంతోమంది మహానుభావులు పోరాటం చేసి అమరులయ్యారని, తద్వారా మనకు స్వాతంత్ర్య సిద్ధించిందని అన్నారు. మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ మాట్లాడుతూ ఎంతోమంది త్యాగధనుల పోరాట ఫలితమే భారతదేశ స్వాతంత్ర్యమన్నారు. మనం దేశాన్ని, ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, నాయకులు రవింద్రచారి, జినుకల కృష్ణాకర్‌రావు, గాధం కుమార్, రాయంచు నాగరాజు, జాడి రామరాజు, రాజశేఖర్, రాకేష్, చల్లూరి మహేందర్, పాపిరెడ్డి, గుగులోత్ స్వరూప, మల్లేష్, వాంకుడోత్ జ్యోతి, వాసుదేవరెడ్డి, కుటుంబరావు, ప్రేమ్‌సింగ్, మహేందర్, కత్తి హరీష్, కృష్ణమూర్తి, భాను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

మరొకరికి గాయాలు



తిరుపతి (ఫైల్)

మొగుళ్లపల్లి, ఆగస్టు 13: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం సోమన్‌పల్లి గ్రామానికి చెందిన యుద్దమారి తిరుపతి(34) కొన్ని సంవత్సరాలుగా వరి సీడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా మండలంలో పని నిమిత్తం వచ్చి తిరిగి మొగుళ్లపల్లి మీదుగా స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో చిట్యాల మండల కేంద్రానికి చెందిన లకుం చంద్రమౌళి మరో ద్విచక్రవాహనంపై ఎదురయ్యాడు. పెద్దవాగు వంతెన సమీపం వద్ద వీరిద్దరి బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో తిరుపతికి అక్కడికక్కడే మృతిచెందాడు.

చంద్రమౌళికి గాయాలు కావడంతో స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు తిరుపతికి భార్య మౌనిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 13 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం బ్యారేజీలోకి 2.21లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 85గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 3.50మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 2,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 66 గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు.

భేష్ బిట్టు!

పోలీసు జాగిలానికి ఘనంగా ఉద్యోగ విరమణ

సేవలను కొనియాడిన సీపీ



వరంగల్ క్రైం, ఆగస్టు 13: 11 ఏళ్ల పాటు పోలీసు విభాగంలో సేవలందించిన బిట్టు (పోలీస్ జాగిలం)కు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళవారం హనుమకొండలోని పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బిట్టును సీపీ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించి చేసిన సేవలను కొనియాడారు. 2013 డిసెంబర్ 26న కమిషనరేట్ జాగిలాల విభాగంలో చేరి బిట్టు పోలీస్‌శాఖకు సేవలందించింది. ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులతో పాటు ఇతర వీఐపీలు కమిషనరేట్ పరిధిలో పర్యటించినప్పుడు పేలుడు పదార్థాలు గుర్తించడంలో బిట్టు కీలకపాత్ర పోషించింది. బిట్టుకు హ్యాంగ్లర్‌గా కానిస్టేబుల్ ప్రభాకర్ వ్యవహరించాడు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసుశాఖలో జాగిలం పాత్ర కీలకమన్నారు. పేలుడు పదార్థాలను గుర్తించడంతో పాటు మత్తు పదార్థాలు గుర్తించడంలోనూ జాగిలాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు శ్రీనివాస్, స్పర్జన్‌రాజ్, శ్రీధర్, చంద్రశేఖర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌కుమార్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు అతిథిగా మంత్రి సురేఖ

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 13: హనుమకొండలోని పోలీస్ పరేడ్‌గ్రౌండులో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను మంత్రి చేతులమీదుగా అందజేస్తారు.

కోల్ రైల్‌కు సై!

ఓరుగల్లుకు రానున్న మూడు కొత్త రైల్వే మార్గాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కోల్‌రైల్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 1998 నుంచి భూపాలపల్లి కోల్‌బెల్ట్‌కు రైల్వే లైన్ నిర్మాణం చేయాలనే డిమాండ్ ఉంది. ఎట్టకేలకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ కోల్‌రైల్‌పై ప్రకటన చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు 207కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మిస్తున్నట్లుగా పేర్కొన్నారు. దీనికోసం డీపీఆర్‌లు సిద్ధం చేశారు. అటవీ శాఖ నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు లేకపోవటం కొంత జాప్యం జరుగుతోంది. అయితే రెండు మూడు నెలల్లో తుది అనుమతులు మంజూరు కానున్నాయని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

రామగుండం నుంచి మణుగూరు వరకు 207కి.మీ.ల రైల్వేలైన్ కోసం సుమారు రూ.4,100 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2013-14లో రామగుండం - మణుగూరు రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే చేయగా, 207కిలోమీటర్ల రైల్వేలైన్‌కు రూ.1,112కోట్లతో ఈ రైల్వే లైన్ నిర్మించవచ్చునని ప్రతిపాదన చేశారు. పదేళ్లలో ఈ అంచనా వ్యయం నాలుగు రేట్లు పెరిగింది. ఇక ఈ లైన్ పూర్తి అయితే భూపాలపల్లికి రైల్ కనెక్టివిటీ ఏర్పడుతుంది. దీంతో బొగ్గు దిగుమతి, ఎగుమతికి కష్టాలు తప్పనున్నాయి. అలాగే రామగుడం నుంచి భూ పాలపల్లి మీదుగా మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణంతో థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు సరఫరా సులభం కానుంది. ప్రస్తుతం భూపాల పల్లిలోని కేటీపీపీకి బొగ్గును రామగుండం నుం చి రైల్ ద్వారా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేస్టేషన్‌కు దిగుమతి చేసుకుంటున్నారు. ఉప్పల్ నుంచి 70కిలో మీటర్లు ప్రయాణించిన పరకాల మీదుగా కేటీపీపీకి బొగ్గును సరఫరా చేస్తున్నారు. దీంతో అధిక వ్యయంతో పాటు సమయానికి బొగ్గు కేటీపీపీకి చేరటం లేదు.

అలాగే ఈ రైల్వేలైన్ ఏరియాలోనే రామగుండం సమీపంలోని 2,600 మెగావాట్ల ఎన్‌టీపీసీ విద్యుత్ కేంద్రంతో పాటు 1,600 మెగావాట్ల తెలంగాణ ఎన్‌టీపీసీ ప్రాజెక్టు, అలాగే జైపూర్‌లోని జెన్‌కోకు చెందిన 6,200మెగావాట్లు, 11 మెగావాట్లు విద్యుత్ కేంద్రాలు భూపాలపల్లిలో ఉన్నాయి. మణుగూరు సమీపంలోని 1,200 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు కూడా రైల్‌మార్గం అందుబాటులో లేదు. ఈ లైన్‌తో బొగ్గు సరఫరా ఈ పరిశ్రమలకు సులభతరం కానుంది. అలాగే కొత్త రైల్వేలైన్‌తో పర్యాటక రంగానికి పండుగ కానుంది. రామగుడం నుంచి మణుగూరు వరకు అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. వీటన్నింటినీ లింకు చేసుకుంటూ లైన్ నిర్మాణం చేయనున్నారు. ప్రధానంగా మంథని, కాళేశ్వరం, రామప్ప, మేడారం, లక్నవరం, ఏటూరునాగారం అభయారణ్యం, బొగత, మల్లూరు తదితర పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు సమీపం నుంచి మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణం సాగనుంది. దీంతో ఈ రైల్వేలైన్‌తో పర్యాటకానికి కొత్త కళ రానుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

డోర్నకల్ టు మిర్యాలగూడ, గద్వాల

రైల్వేశాఖ ప్రకటించిన కొత్త ప్రాజెక్టుల్లో కీలకమైనది మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105కి.మీ రైల్వే లైన్. ఈ ప్రాజెక్టు కోసం రైల్వేశాఖ రూ.2,100కోట్ల అంచనాలతో డీపీఆర్ తయారు చేశారు. డోర్నకల్ నుంచి మహబూబాబాద్, ఖమ్మం జిల్లా ముదిగొండ, రాజేశ్వరపురం, నేలకొండపల్లి, కోదాడ మీదుగా మిర్యాలగూడ చేరుతుంది. ఈ లైన్‌తో హైదరాబాద్, విజయవాడ, చెన్నై, న్యూఢిల్లీకి అనుసంధానమవుతుంది. దీంతో యాదాద్రి పవర్ ప్లాంట్ వరకు భూపాలపల్లి నుంచి బొగ్గును, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం నుంచి ధాన్యం, బియ్యం, గ్రానైట్ పరిశ్రమలకు, సిమెంట్ పరిశ్రమలకు సరుకులను రవాణా, షుగర్ ఫ్యాక్టరీల నుంచి చెక్కర సరఫరా చేసేందుకు మార్గం సుగమమవుతుంది.

అలాగే డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కిలో మీటర్ల రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ లైన్ కోసం రూ.5వేల కోట్లతో అంచనాలను రూపొందించింది. ఈ లైన్‌తో వరంగల్ మీదుగా హైదరాబాద్, విజయవాడ సాగే లైన్‌తో మహబూబ్‌నగర్ మీదుగా హైదరాబాద్, బెంగూళూరు లైన్‌ను అనుసంధానం చేస్తున్నారు. కీలకమైన రెండు మార్గాలను అనుసంధానంతో పాటు కొత్తగా రైల్వేలైన్ లేని ప్రాంతాలకు కూడా రైల్వే కనెక్టివిటీ జరుగుతుంది. ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలిపే ఈ లైన్‌తో డోర్నకల్ జంక్షన్ మరింత కీలకంగా మారనుంది. వీటితో పాటు పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి వరంగల్ వరకు 1,316కిలో మీటర్ల రైల్వే కనెక్టివిటీకి కేంద్ర రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఈప్రాజెక్టుకు సుమారు రూ.7,382కోట్లు ఖర్చు చేస్తుంది. భద్రాచలం వద్ద నిర్మించే కొత్త స్టేషన్‌తో వరంగల్ రైల్వేలైన్‌కు అనుసంధానం అవుతుంది. గిరిజనుల అధికంగా ఉండే ప్రాంతాల గుండా ఈ రైల్వేలైన్ ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా బొగ్గు సరఫరాతో పాటు ప్రకృతి వైపరిత్యాల సందర్భాల్లో ప్రత్యామ్నాయం లైన్‌గా ఇది పని చేస్తుందని రైల్వేశాఖ భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆరు ప్రాజెక్టుల్లో నాలుగు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రయోజనం చేకూర్చేవే కావటం విశేషం.

అటకెక్కిన కాజీపేట - భూపాలపల్లి లైన్

కాజీపేట-భూపాలపల్లి మధ్య రైల్వేలైన్‌కు 2023-24 బడ్జెట్‌లో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) కోసం రైల్వే శాఖ రూ.1,152కోట్ల నిధులు మంజూరు చేసింది. కాజీపేట నుంచి హసన్‌పర్తి లైన్ మీదుగా కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్ నుంచి రెండు కిలో మీటర్ల దూరంలోని మర్రిపల్లి గ్రామం వద్ద సైడ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. మర్రిపల్లి ట్రాక్ నుంచి చిట్యాల మండలం జడలపేట మీదుగా భూపాలపల్లి వరకు ఈ లైన్ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే 2023-24లో నిధులు కేటాయించినప్పటికీ పనులు ముందుకు సాగలేదు. దీంతో 2024-25 బడ్జెట్‌లో కాజీపేట- భూపాలపల్లి రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ రాలేదనే విమర్శలున్నాయి. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కాజీపేట-భూపాలపల్లి లైన్‌పై దృష్టి పెట్టి రైల్వేశాఖపై ఒత్తిడి తీసుకురావాలని ఓరుగల్లువాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఊసేలేని రైల్వే డివిజన్

కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియాకు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్ మీదుగా ప్రతీరోజు సుమారు 200కు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ అదాయం వచ్చే జంక్షన్‌లల్లో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తుంది. హైదరాబాద్-సికింద్రాబాద్‌కు 128కిలో మీటర్లకు పైగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా చేయటంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు ఉన్నాయి.

నేత కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

మడికొండ, ఆగస్టు 13: కాంగ్రెస్ ప్రభుత్వం నేత కార్మికులకు అండగా ఉండి ఆదుకుంటోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం మడికొండలోని టెక్స్‌టైల్ పార్కులో సిడ్‌బీ క్లస్టర్ ఇంటర్వెన్షన్ ప్రొగ్రామ్ ఏజీఎం స్మృతివాజ్‌పేయి ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన లాంచ్ వర్క్‌షాప్ కమ్ అడాప్షన్ ఆఫ్ గ్రీన్ టెక్నాలజీ సెమినార్‌లో వరంగల్ ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పొట్టచేతపట్టుకొని సూరత్, షోలాపూర్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సొంత రాష్ట్రంలో తమ తల రాతలు మారతాయని నమ్మి వచ్చిన నేత కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, నేత కార్మికులకు సైతం తగిన న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. తన శక్తి మేరకు నేత కార్మికులకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంట్‌లో మాట్లాడి జిల్లాకు వెల్‌నెస్ సెంటర్ తీసుకువచ్చానని తెలిపారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ పార్కులో యూనిట్లు సక్రమంగా నడుస్తున్నాయని భావించానని, క్షేత్రస్థాయిలో నేత కార్మికుల పరిస్థితి వేరే విధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం నేత కార్మికులను నిర్లక్ష్యం చేసిందన్నారు. నేతకార్మికులు తనతో సమావేశమై తమ సమస్యలు పూర్తిగా తెలిపినట్లయితే వారిని మంత్రి కొండా సురేఖ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాకతీయ టెక్స్‌టైల్ అండ్ వీవర్స్ వెల్‌ఫేర్ పొదుపు, పరస్పర సహాయక సహకారం సంఘం అధ్యక్షుడు ఊరుకొండ శ్రీరాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభించిన టెక్స్‌టైల్ పార్కులో 164 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి ప్రారంభించాయని, వాటికే లోన్లు వచ్చాయని, మిగతా 200యూనిట్లకు లోన్‌లు మంజూరు కాకపోవడంతో ఖాయిలా పడ్డాయన్నారు. వాటికి ప్రభుత్వం సబ్సిడీగానీ, విద్యుత్ సబ్సిడీ గానీ రానందున యూనిట్లు ఉత్పత్తి చేయడంలేదని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందించే స్కూల్ యూనిఫామ్‌లు, సింగరేణి వంటి సంస్థలకు ఇచ్చే యూనిఫామ్‌లకు చెందిన వస్త్రాలను నేసే పనిని తమకు ఇప్పించినట్లయితే నేత కార్మికులను ఆదుకున్నట్లవుతుందని తెలిపారు. ఈ మేరకు ఎంపీ, ఎమ్మెల్యే చొరవచూపి తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దర్గా స్వామి, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, కోశాధికారి ఆముదాల జ్యోతిభాస్కర్, డైరెక్టర్లు సదానందం, రాధిక తిరుపతి నేత కార్మికులు, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వస్కుల శంకర్, బిల్ల రవిందర్, వస్కుల నాగరాజు, కుర్ల మోహన్, కొప్పుల నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కడియం కావ్య

ఇంటర్ ఆర్జేడీ కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలి

ఉత్తర్వులు జారీ చేసిన ఇంటర్ విద్య డైరెక్టర్ శృతి ఓఝా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించిన ఇంటర్మీడియెట్ ఆర్జేడీ కార్యాలయాన్ని వెంటనే వరంగల్‌లో తిరిగి ప్రారంభించాలని ఇంటర్మీడియెట్ విద్యాశాఖ డైరెక్టర్ శృతి ఓఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్యాలయ భవనం సమకూరే వరకు ప్రస్తుతానికి హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయాలని ఆమె ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఆర్జేడీ కార్యాలయం తరలింపునకు ముందు పనిచేసిన ఆర్జేడీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌తో పాటు అందరూ సిబ్బంది తిరిగి ఆర్జేడీ కార్యాలయంలో విధుల్లో చేరాల్సిందిగా ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఆర్జేడీ కార్యాలయం తిరిగి వరంగల్‌లో ఏర్పాటు కానుండటంతో వివిధ అధ్యాపక సంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ బృంద గీతాల పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ఈనెల 31న జాతీయ బృందగీతాల పోటీలను నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సుధీర్‌కుమార్, కె.సత్యనారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రంలోని సామా జగన్మోహన్ స్మారక భవనంలో 6 నుంచి 10 తరగతులు చదివే విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి 6 నుంచి 8 మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22లోగా పోటీల కన్వీనర్ కమలమనోహర్ (9440604347)కు వివరాలను పంపించాల్సిందిగా వారు కోరారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో నిట్‌కు 21వ ర్యాంకు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) నిట్‌కు ఇంజనీరింగ్ కేటగిరిలో 21వ ర్యాంకు దక్కింది. సోమవారం సాయంత్రం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో నిట్‌కు ఓవరాల్ కేటగిరిలో 53వ ర్యాంకు సాధించింది. మేనేజ్‌మెంట్ విభాగంలో 100వ ర్యాంకును పొందింది. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులను క్షుణ్ణంగా విశ్లేషిస్తామని, మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి : డీఎంహెచ్‌వో

కాటారం, ఆగస్టు13: సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ మధుసూదన్ అన్నారు. కాటారం పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్షించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్య సూత్రాలు, జాగ్రత్తలను తెలపాలన్నారు. దోమల నియంత్రణ కోసం మందును పిచికారీ చేయాలని, మురికినీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయించాలని అన్నారు. పంచాయతీరాజ్, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పారిశుధ్య నిర్వ హణ, డ్రై డే కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు విజృంభించకుండా చర్యలు చేపట్టాలన్నారు. టీబీ కేసుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీహెచ్‌సీ, సబ్ సెంటర్లలో అవస రమైన మందులు, ఇతర పరికరాల వివరాలు అంద జేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ శ్రీదేవి, ఎపిడామాలజిస్ట్ బాష్యా నాయక్, డీపీవో చిరంజీవి, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెరువులతో భవిష్యత్ తరాలకు ప్రయోజనం

ఈజీఎస్ ఈసీ సురేష్

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 13: చెరువుల అభివృద్ధి వల్ల భవిష్యత్ తరాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఉపాధిహామీ పథకం ఈసీ జనగాం సురేష్ అన్నారు. అమృత్ సరోవర్ మహోత్సవ వేడుకల్లో భాగంగా మండలంలోని లక్ష్మీదేవిపేట కోయకుంట వద్ద నీటి వినియోగం-రక్షణపై విద్యార్థులతో మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ అమృత్ సరోవర్ మహోత్సవ కార్యక్రమాలు ఈనెల 15 వరకు వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువులను అభివృద్ధి చేయడంతోపాటు పరిసరాల్లో ఆహ్లాద వాతావరణం కల్పించనున్నట్లు తెలిపారు. చెరువుగట్లపై నీడనిచ్చే మొక్కలు పెంచాలన్నారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు పోరిక సురేష్, కోరె కుమారస్వామి, అమరావతి విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు వీరగాని రాజయ్య, ఉపాధ్యాయులు మూల రాజయ్య, కిరణ్, అఖిల, కారోబార్ గోస్కుల లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్లు కేతిరి రాధిక, నల్లబెల్లి భాస్కర్, పోలోజు రామాచారి, రైతులు సంపత్‌రెడ్డి, కేతిరి భిక్షపతి, మునిగాల రామకృష్ణ, పాలకుర్తి జ్యోతి, చిలుక కొమురయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



అమృత్ మహోత్సవంలో ఉపాధిహామీ అధికారులు, విద్యార్థులు

ఉత్సాహంగా 'హర్‌ఘర్ తిరంగా' ర్యాలీలు



మొగుళ్లపల్లిలో బీజేపీ తిరంగా ర్యాలీ



వాజేడులో సీఆర్పీఎఫ్ జవాన్లు..



మహదేవపూర్‌లో తిరంగ ర్యాలీ

మొగుళ్లపల్లి, ఆగస్టు 13: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు బీజేపీ మండల అధ్యక్షుడు శేషగిరి ఆధ్వర్యంలో నాయకులు చౌరస్తా నుంచి ఎంజేపీ గురుకుల పాఠశాల వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు శేషగిరి, నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, శ్రీధర్, కిషన్‌రావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో...

వాజేడు: మండల కేంద్రంలో సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. సీఆర్పీఎఫ్ డీఎస్పీ సతీష్‌కుమార్ నేతృత్వంలో మండల కేంద్రంలోని పురవీధులో జాతీయ జెండాలను చేతపట్టి 'భారత్ మాతాకి జై' అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. వాజేడు పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ హనుమాన్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయం, జూనియర్ కాలేజీ మీదుగా జరిగింది.

బీజేవైఎం ఆధ్వర్యంలో..

మహదేవపూర్ : మండలంలో గవర్నమెంట్ హైస్కూల్ బాలురు, బాలికలు, జూనియర్ కళాశాల విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా తిరంగా యాత్రను నిర్వహించారు. సుమారు వెయ్యి మంది 500 మీటర్ల జాతీయ జెండాతో మంగళవారం ర్యాలీ చేపట్టారు. బీజేవైఎం మండల అధ్యక్షు డు రాంశెట్టి మనోజ్, బీజేపీ అధ్యక్షుడు ఆకుల శ్రీధర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపల్లి జోగేశ్వర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, శ్రీమన్నారాయణ, మంథని రాజేందర్, అంకరి రాజేందర్, బీజేవైఎం నాయకులు సంపత్, సాయి, పూర్ణచందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలు అందజేత

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం పోస్టాఫీసులో బీపీఎం పూల్‌సింగ్ మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు జాతీయ జెండాలను అందజేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై మహేంద్రకుమార్ యాదవ్‌తోపాటు కార్యాలయాల్లోని అధికారులకు అందించారు.

కాంగ్రెస్‌కు రైతులు గుణపాఠం చెప్పాలి

రైతు రచ్చబండ కార్యక్రమంలో బీజేపీ నేతలు

గోవిందరావుపేట, ఆగస్టు 13: ఎన్నికలకు ముందు సాధ్యంకాని అనేక హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులు గుణపాఠం చెప్పాలని బీజేపీ నేత, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు ఆధ్వర్యంలో రైతు రచ్చబండ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రజలకు అమలుకాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ అనతికాలంలోనే విస్మరించిందని విమర్శించారు. ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయకుండా ప్రజలు, రైతులను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నిబంధనల పేరుతో చాలా మందిని దూరం చేశారని అన్నారు. రైతులు, ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ఇప్పటికైనా మోసపూరిత విధానాలను పక్కనబెట్టి పంట రుణం తీసుకున్న ప్రతిరైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, నాయకులు రవింద్రచారి, నరేష్, కొత్త సురేందర్, పెద్ది మహేందర్‌రెడ్డి, జినుకల కృష్ణాకర్, జాడి రామరాజు, వెంకటేశ్వర్లు, రుద్రారపు సురేష్, మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గాదం కుమార్, రాజశేఖర్, బండి బాబు, వీరభిక్షం, భూక్య శ్రీనివాస్, బూర సుధాకర్, వడ్లకొండ యాకయ్య, వెంకటేశ్వర్లుతోపాటు రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం నాయక్

విజయోత్సవ ర్యాలీకి తరలిన మాదిగలు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 13: హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన మహాజన నేత మంద కృష్ణమాదిగ విజయోత్సవ ర్యాలీకి జిల్లా నుంచి ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ములుగులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాం బాబు తదితరులు పాల్గొన్నారు.



ములుగులో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

● మల్హర్: హైదరాబాద్‌లో నిర్వహించిన మందకృష్ణ మాదిగ విజయోత్సవ ర్యాలీకి మండలం నుంచి పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల అధ్యక్షుడు కేశారపు నరేష్, పులిగంటి రాములు, నారమల్ల నవీన్, తాండ్ర దినేష్, అవినాష్, అరుణ్, సిద్ధు, వరుణ్, శ్రీనివాస్, రంజిత్, శశి తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ ఆర్థిక సహాయానికి గడువు పెంపు

కాకతీయఖని, 13: ఈ-శ్రమ్ పథకం కింద ఆర్థికసాయం పొందేందుకు గడువు పొడిగించినట్లు భూపాలపల్లి జిల్లా సహాయక కార్మిక శాఖ అధికారి వినోద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 మార్చి 2022 కంటే ముందు నమోదైన అసంఘటిత రంగ కార్మికులు ప్రమాదంలో మరణించినా, అంగవైకల్యం పొందినా సహాయం కోసం ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థిని పరామర్శించిన మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 13: మండలంలోని బండారుపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న వేల్పుల కార్తీక్ ఇటీవల పాముకాటుకు గురైన విషయం తెలిసిందే. ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క మంగళవారం పరామర్శించారు. కార్తీక్ ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆమె వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఉన్నారు.



వైద్య సేవలను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి : డీఎస్పీ

మొగుళ్లపల్లి, ఆగస్టు 13: మండలంలోని రంగాపురం గ్రామస్థులు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు కోరారు. మంగళవారం గ్రామంలోని రైతువేదికలో గ్రామస్థులు, వ్యాపారులు, రైతులు, ప్రజాసంఘాల నాయకులు, పలుపార్టీల నాయకులతో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఒక సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమన్నారు. గ్రామం మొత్తం సీసీ కెమెరాల నీడలో ఉంటుందని అన్నారు. దొంగతనాలు జరిగినట్లయితే నిందితులను తొందరలోనే గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. అనంతరం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై బి.అశోక్, గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతకాని బ్రిడ్జి వద్ద హెచ్చరిక చిహ్నాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాటారం, ఆగస్టు13: మండలంలోని చింతకాని మంచినీళ్ల వాగు బ్రిడ్జి వద్ద ఆర్‌అండ్‌బీ సిబ్బంది మంగళవారం హెచ్చరిక చిహ్నాలు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలతో బ్రిడ్జి వద్ద రోడ్డు కొంతమేర కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో సోమవారం 'ప్రమాదకరంగా ప్రధాన రహదారులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు తాత్కాలికంగా చర్యలు చేపట్టారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదంగా ఉన్నదని తెలియజేసేలా కర్రలు పాతి వాటిపై రేడియం స్టికర్లు అంటించారు. ఎర్ర జెండాలు అమర్చారు.

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలి

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న

కాకతీయఖని, ఆగస్టు 13: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి వార్షిక లాభాల్లో వాటా ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న డిమాండ్ చేశారు. ఏరియా జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సేన్‌కు ఈ మేరకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులు సింగరేణిలో తక్కువ వేతనాలకు పనిచేస్తూ ఎక్కువగా శ్రమిస్తున్నారని అన్నారు. అలాంటి వారికి లాభాల్లో వాటా ఇవ్వడం సరైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సింగరేణి జీఎం సన్మానం

కాకతీయఖని, ఆగస్టు 13: తారా ఆర్ట్స్ అకాడమీ నుంచి నల్లవజ్రం కీర్తి పురస్కారాన్ని అందుకున్న సింగ రేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-1వ గని కార్మికుడు అడిచర్ల శ్రీనివాస్‌ను జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్ మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సివిల్ డీజీఎం రవికుమార్, డీవైపీఎం రాజు, స్పోర్ట్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న జీఎం

ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

తాడ్వాయి, ఆగస్టు 13: మండలకేంద్రంలో స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) మండల అధ్యక్ష, ప్రధాన కార్య దర్శుల ఎన్నిక మంగళవారం జరిగింది. కమిటీ మండల అధ్యక్షుడిగా కందిక రాజు, ప్రధాన కార్యదర్శిగా జన్ను శామ్సన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలం కృష్ణయ్య, నాయకులు సతీష్, కుమార్, రామ్మూర్తి, సుజాత, సమ్మయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాజు, శామ్సన్

ములుగు మండలంలో సభ్యత్వ నమోదు

ములుగు రూరల్: ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలో మంగళవారం నిర్వహిం చారు. జాకారం, అబ్బాపూర్, భూపాల్‌నగర్, రాచంద్రాపూర్, రాంనగర్‌తండా, గుత్తూరు తండా, శ్రీనగర్, మహ్మద్‌గౌస్‌పల్లి పాఠశాలల్లో ఉపాధ్యాయుల సభ్యత్వాన్ని నమోదు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్, ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, ములుగు మండల అధ్యక్షుడు మహ్మద్ హమీద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అజ్మీరా దశరథ్, మండల కార్యవర్గ సభ్యుడు డేగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు వెంటనే చేపట్టాలి

ములుగు రూరల్ ఆగస్టు 13: మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు వెంటనే చేపట్టా లని ఉపాధ్యాయ ఫెడరేషన్ బాధ్యుడు మహ్మద్ అయాజ్ ఖాన్ డిమాండ్ చేశారు. మండలంలోని బండారుపల్లి మోడల్ పాఠశాల వద్ద మంగళవారం భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఒకేచోట ఎక్కువ రోజులు పనిచేయడంతో విధులు, బాధ్యతల్లో స్తబ్దత నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి మం జుల, ఉపాధ్యాయులు రవిప్రసాద్, కృష్ణ, రుద్రమదేవి పాల్గొన్నారు.

మాదిగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

గోవిందరావుపేట, ఆగస్టు 13: మండలంలోని కర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బూడిదగడ్డ గొత్తికోయలకు బల్గూరి రమక్క జ్ఞాపకార్థం బల్గూరి మాదిగ ఫౌండేషన్ నాయకులు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మాదిగ దండోరా జాతీయ నాయకుడు నెమలి నర్సయ్య చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. బల్గూరి మాదిగ ఫౌండేషన్ చైర్మన్ భద్రయ్య, జిల్లా కార్యదర్శి ఉపేందర్, నాయకులు జన్ను సుధాకర్, లావుడ్యా రవినాయక, పసుల కృష్ణ, కుర్సం భద్రయ్య, మడివి దేవా తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అరికట్టాలి : సీపీఎం

గోవిందరావుపేట, ఆగస్టు 13: అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని సీపీఎం మండల కార్యదర్శి తీగల ఆగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం రాత్రి ఆయన ఆధ్వర్యంలో నాయకులు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై నిరసన వ్యక్తంచేశారు. ఈనెల 9న పస్రా సమీపంలో ఎలాంటి డీడీలు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గోదావరి నుంచి వరంగల్, హైదరాబాద్, తదితర ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొదిళ్ల చిట్టిబాబు, గొంది రాజేష్, కడారి నాగరాజు, సప్పిడి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమిస్తే చర్యలు తప్పవు

కాటారం, ఆగస్టు13 : రోడ్డును ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగజేసే వారిపై చర్యలు తప్పవని కాటారం సీఐ నాగార్జునరావు, ఎంపీవో వీరస్వామి హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం రాత్రి వారు పర్యటించారు. జాతీయ రహదారిపై సెంట్రల్ డ్రెయినేజీ దాటుకొని రోడ్డును ఆక్రమిస్తూ వ్యాపారాలు, వస్తువులు పెట్టే వారికి హెచ్చరికలు జారీ చేశారు. వాహనాలను సక్రమంగా పార్కింగ్ చేసుకోవడానికి వీలులేకుండా చేస్తున్న వారిని ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అభినవ్, పంచాయతీ కార్యదర్శి సఫీర్‌ఖాన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఇల్లు కూలి వృద్ధురాలికి గాయాలు

రేగొండ, ఆగస్టు 13 : ఇల్లు కూలి వృద్ధురాలికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని రావులపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రావులపల్లికి చెందిన ఆరెల్లి లక్ష్మి రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారుజామున ఇంటి గోడలు కూలిపోయాయి. దీంతో లక్ష్మికి తీవ్ర గాయాలు కాగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో ఆమెను వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు.

ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

ములుగు, ఆగస్టు 13: జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర మంగళవారం రాత్రి ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8:30గంటల సమయంలో ఆస్పత్రికి వచ్చిన గంటపాటు ఇక్కడే ఉన్నారు. వార్డులన్నీ కలియదిరిగి చికిత్సపొందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది అటెండెన్స్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. టీ-డయాగ్నో హబ్‌ను తనిఖీ చేసిన ఆయన రోగ నిర్ధారణ పరీక్షల తీరును తెలుసుకున్నారు. పరిసరాలలో చెత్తతో అపరిశుభ్రంగా ఉండటంతో అసహనం వ్యక్తంచేశారు.

తండ్రిపై కూతురి ఘాతుకం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 13: ఆస్తి కోసం తండ్రిపై కూతురు దాడి చేయించిన సంఘటన భూపాలపల్లిలోని కారల్‌మార్క్స్‌కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..

కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన బొమ్మన లచ్చిరెడ్డి సింగరేణి కార్మికుడిగా పని చేసి రిటైర్ అయ్యాడు. కారల్‌మార్క్స్‌కాలనీలో నివాసముంటున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె రాజేశ్వరి, అల్లుడు జగన్మోహన్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. చిన్న కుమార్తె మల్లేశ్వరి, అల్లుడు లక్ష్మారెడ్డి మంజూర్‌నగర్‌లో ఉంటున్నారు. చిన్న కుమార్తె జెన్‌కోలో ఉద్యోగం చేస్తోంది. తన తండ్రి ఆస్తి విషయంలో ఇద్దరు కూతుళ్ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తన కంటే ఎక్కువగా తన అక్క ఆస్తి పొందుతోందని చిన్న కుమార్తె కోపం పెంచుకుంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం నలుగురు వ్యక్తులపాటు భర్తను తీసుకొని ఒంటరిగా ఉంటున్న తండ్రి ఇంటికి వెళ్లింది. ఆయనకు వీరు బాగా మద్యం తాగించారు. మద్యం మత్తులో ఉన్న లచ్చి రెడ్డిని విచక్షణా రహితంగా కర్రలతో చిత కబాదారు. దీంతో లచ్చి రెడ్డి రెండు కాళ్లకు తీ వ్రంగా గాయాలయ్యాయి. ఆ వెంటనే తమకేమీ తెలియ దన్నట్టు తండ్రిని మల్లేశ్వరి వంద పడకల ఆస్పత్రికి తర లించింది. మెట్ల మీద నుంచి జారి పడటంతో తండ్రికి గాయాలయ్యాయని వైద్యులకు చెప్పింది. అక్కడికి చేరుకున్న లచ్చిరెడ్డి పెద్ద కుమార్తె, అల్లుడు అనుమానంతో చిన్న కుమార్తె, ఆమె భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వంద పడకల ఆస్పత్రికి పోలీసులు వెళ్లి బాధితుడి నుంచి వివరాలు తీసుకున్నారు. చిన్న కుమార్తె, అల్లుడుతోపాటు మరికొంత మంది వ్యక్తులు తనను కొట్టినట్లు బాధితుడు వెల్లడించినట్లు సమాచారం. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు.



చికిత్స పొందుతునన్న లచ్చిరెడ్డి

హిందువులపై దాడికి నరసనగా ర్యాలీ



చిట్యాలలో హిందూ సంఘాల ర్యాలీ

చిట్యాల, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ సంఘాలు పట్టణ కేంద్రం బంద్‌కు పిలుపునిచ్చాయి దీంతో మండల కేంద్రంలో మంగళవారం వ్యాపార వాణిజ్య సంస్థలు తెరుచుకోలేదు. విద్యా సంస్థలు బంద్‌లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ బుర్ర సదయ్య మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణహోమం సృష్టిస్తున్న శక్తులను నిర్మూలించాలన్నారు. ఈకార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు కనుకుల లక్ష్మారెడ్డి, రాఘవరెడ్డి, చెక్క నర్సయ్య, బుర్ర వెంకటేశ్, గుండా సురేష్, వేల్పుల రాజ్‌కుమార్, తిరుపతిరెడ్డి, మాచర్ల రఘు, కంచు కుమారస్వామి, గజనాల రవీందర్, మైదం శ్రీకాంత్, మాసు రమేష్, తాటిపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట: బంగ్లాదేశ్ హిందువులపై దాడులకు నిరసనగా బీజేపీ, ఆ పార్టీ అనుబంధ సంఘాలు, బహుజన పూజారుల శివసత్తుల సంఘం, వర్తక సంఘాలు మంగపేట, కమలా పురంలో వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించాయి. బీజేపీ, బీజేవైఎం, జ్వాల యూత్, కస్తూర్బా మహిళా మండలి, వర్తక సంఘం, బిల్ట్ కార్మికులు పాల్గొన్నారు.

● ములుగు : బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ములుగులో హిందూ ధర్మపరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి కూడలి నుంచి బస్టాండు సెంటర్ వరకు కాశాయ జెండాలతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, మండల అధ్యక్షుడు గాదం కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 13: విద్యుదా ఘాతంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలో గుర్రంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అబ్బోజు కౌసల్య (70) ఇంటి ముందున్న తీగపై బట్టలు ఆరేయడానికి యత్నించింది. పక్కనే ఉన్న విద్యుత్ వైరు తెగిపోయి ఉండగా ఆ తీగకు కరెంట్ సరఫరా అయ్యి కౌసల్య షాక్‌కు గురై మృతి చెందింది. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.



కౌసల్య మృతదేహం

గుణాత్మక విద్యను బోధించాలి

ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి చంద్రకళ

మంగపేట, ఆగస్టు 13: విద్యార్థులకు అధ్యాపకులు విలువలతో కూడిన గుణాత్మక విద్యను బోధించాలని ఇంటర్మీడియట్ విద్యా జిల్లా అధికారి డి. చంద్రకళ అన్నారు. మండల కేంద్రంలోని ఎక్కటి సరోజని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె మంగళవారం సందర్శించారు. ప్రిన్సిపాల్ వీరేందర్, అధ్యాపకులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కళాశాల పరిసరాలు, అధ్యా పకుల హాజరు రిజిష్టర్, తరగతి గదులను ఆమె పరిశీలించారు. వ్యవస్థగత సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను, హాజరు శాతాన్ని పెంచాలన్నారు. ఈ సందర్భంగా తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.రజిత, జె.జ్యోతిర్మయి, వై.రేణుకాదేవి, ఎం.సంతోష్ కుమార్, ఎం.లక్ష్మణ్, పి.అనిల్‌కుమార్, జె.రవీందర్‌నాయక్, శ్రీనివాస్, వందన, వైష్ణవి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల శాంతి ప్రదర్శన

కృష్ణకాలనీ (కృష్ణకాలనీ), ఆగస్టు 13: భూపాలపల్లిలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు కొవ్వొత్తులతో మంగళవారం సాయంత్రం శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కోల్‌కత్తాలో ఓ వైద్యురాలిని అత్యంత దారుణంగా హత్య చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలకు పునరావృతం కాకుండా వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రధాన్, ప్రవీణ్‌కుమార్, మానస, దివ్య, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు